

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 4012 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1891 క్యూసెక్కులు వదిలారు.



పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునకొండను ఆదివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. లాంచీల ద్వారా రూ.61,750 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి రెండు గేట్లను 2 మీటర్లు ఎత్తు లేపి 50,986 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి 58,788 క్యూసెక్కులు చేరుతుంది.

న్యూస్‌రీల్

పేదలకు అందని ద్రాక్షగా వైద్యం, వైద్య విద్య

గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్ల: రాష్ట్రంలో వైద్యం, వైద్య విద్యను చంద్రబాబునాయుడు ప్రైవేటీకరణ చేస్తున్నారని, దీంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పిడుగురాళ్లలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలు నిర్మిస్తే అందులో పల్నాడు ప్రాంతంలోని కామేపల్లి గ్రామం వద్ద 600 పడకల వైద్య కళాశాల ఉందన్నారు. ఇప్పటికే రూ.300 కోట్లతో భవన నిర్మాణం పూర్తి అయిందని, మిగిలిన భవనాలను పూర్తి చేస్తే పల్నాడు ప్రాంతంలోని పేదలందరికీ ఉచిత వైద్యం, ఉచిత వైద్య విద్య అందుతుందన్నారు. పల్నాడు ప్రాంతంలో కనీసం 30 పడకల హాస్పటల్ లేని పరిస్థితుల్లో 600 పడకల హాస్పటల్‌ను జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించారని, అయితే నేడు చంద్రబాబునాయుడు ప్రభుత్వ వైద్యశాల, వైద్యకళాశాలలను ప్రైవేటీకరణ చేసే కార్యక్రమం చేస్తున్నారని అన్నారు. దీని వలన పేదలకు వైద్యం, వైద్య విద్య భారంగా మారుతుందని పేర్కొన్నారు.

పలువురు డీఎస్పీలు బదిలీ

నగరంపాలెం: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం 47 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ సీహెచ్.ద్వారక తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు రేంజ్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలువురు డీఎస్పీలకు స్థానచలనం కలిగించారు. గుంతకల్లు డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్‌ను గుంటూరు తూర్పు సబ్ డివిజన్ డీఎస్పీగా, వెయింటింగ్‌లో ఉన్న డీఎస్పీ ఎం.రమేష్‌ను గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా, పీసీఎస్అండ్ఎస్ డీఎస్పీ ఎం.హనుమంతరావును పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీగా నియమించారు. సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథబాబును పోలీస్ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ బి.సీతారామయ్యను గుంటూరు ఎస్‌బీ డీఎస్పీగా, పల్నాడు జిల్లా ఉమెన్ పీఎస్ డీఎస్పీ బి.ప్రసాద్‌ను చంద్రగిరి డీఎస్పీగా బదిలీ చేశారు.

పూర్ణాహుతితో ముగిసిన అర్ధ చాతుర్మాస్య దీక్ష



అమరావతి: స్థానిక వాసవి నిత్యాన్నదాన వానప్రస్థాశ్రమంలో గత 60 రోజుల నుంచి తెనాలి శ్రీ సాలగ్రామ ట్రస్ట్ పీఠాధిపతి ప్రజ్ఞానంద భారతీస్వామి నిర్వహిస్తున్న అర్ధ చాతుర్మాస్యదీక్ష ఆదివారం పూర్ణాహుతితో ముగిసింది. శనివారం రాత్రి అప్పలాయగుంట వేంకటేశ్వర స్వామి దేవస్థానం అర్చకుల నేతృత్వంలో శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం హోమానంతరం బాల స్వామీజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ నేడు యాంత్రికంగా ఉండే ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత వైపు మనసు మరల్చుకోవాలన్నారు. అమరేశ్వర స్వామి దేవస్థాన ఈఓ వేమూరి గోపి, తిరుమల తిరుపతి దేవస్థానంలో దాస గాన సాహిత్య ప్రాజెక్ట్ గుంటూరు జిల్లా కో–ఆర్డినేటర్ వాసుదేవరావు, ఆర్యవైశ్య ప్రముఖులు గోపు రామకష్ణ, చుండూరు లోకనాథం, ఎస్.ఎస్.ఆర్.ఆంజనేయులు, సురేంద్ర, మాజేటి గోపాలకృష్ణ శ్రేష్టి, వాసవి సత్రం సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

- స్థానిక వాసవి ఆర్యవైశ్య సత్రంలో ప్రజ్ఞానంద భారతి పీఠాధిపతుల నేతృత్వంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని మేళతాళాలతో, వేదమంత్రోచ్చారణల నడుమ అమరేశ్వరఘాట్ వద్ద కృష్ణా నదిలో నిమజ్జనం చేశారు.

భగ్గుమంటున్న ఉల్లి ధరలు

భట్టిప్రోలు: ఉల్లి ధరలు పెరగడంతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. నిన్నటివరకు రూ.30 ఉన్న కిలో ధర రోజురోజుకీ పెరుగుతుండటంతో సామాన్యులు కొనాలంటే భయపడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.70గా ఉంది. కొందరు బడా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఇలా ధరలు పెంచుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇంత పెట్టినా నాణ్యమైన ఉల్లి దొరకడం లేదు. నీరు లేక ఎండిపోయి, కుళ్లిపోయిన ఉల్లిపాయలు మాత్రమే విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

సేవలపై శీతకన్ను

పేదల కష్టనష్టాలు పట్టించుకోని కూటమి ప్రభుత్వం.. వారికి అందేసాయం, సేవలపైనా శీత 'కన్ను' వేసింది. సాయమో.. రామ 'చంద్రా'.. అంటూ ఎలుగెత్తుతున్న పేదల వైపునకు 'చూపు' తిప్పని సర్కారు పెద్దలు.. వారికి అందే వైద్యసేవలను ఏ విధంగా నిలువరించాలనే విషయంపై మాత్రం ప్రత్యేక 'దృష్టి' నిలిపారు. తాజాగా పేదలకు కంటి వైద్యపరీక్షలు, అద్దాలు ఉచితంగా అందించే సీఎం ఈ–ఐ కేంద్రాల్లో సేవలు నిలిపివేయడమే కాకుండా.. వాటిని శాశ్వతంగా మూసివేసేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోంది.

నేత్ర పరీక్ష కేంద్రాల మూసివేతకు సర్కారు యత్నాలు

- ఇప్పటికే ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలలో సేవలు నిలిపివేత
- పరీక్షలు, కళ్లజోడు నమోదు ప్రక్రియకు బ్రేక్
- ప్రభుత్వ అసమర్థతకు 'అద్దం' పడుతున్న చర్యలు
- నిధులు, సిబ్బందిని సమకూర్చి ఈ–ఐ కేంద్రాలకు జవసత్వాలు ఊదిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో నేత్ర రుగ్మతల బాధితుల అవస్థలు
- సిబ్బందికి ఉద్వాసన పలికేందుకూ రంగం సిద్ధం!

బెల్లంకొండ: పేద ప్రజలకు అత్యాధునిక యంత్రాలతో నేత్ర పరీక్షలు చేసి, ఉచితంగా కళ్లజోళ్లు అందించే ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలకు కూటమి సర్కారు మంగళం పాడేందుకు సిద్ధమైంది. సంక్షేమ పథకాల అమలుపై ఎన్నికల ముందు బీరాలు పలికిన కూటమి నేతలు... అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా వాటి ఊసే ఎత్తడం లేదు. ఇచ్చిన హామీలు, పథకాలు అమలు చేయపోగా.. గత ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు మంగళం పాడడంలో మాత్రం ముందుంటున్నారు. 2017లో ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలను అప్పటి ప్రభుత్వం ప్రారంభించినా, వెంటనే అమలులో చేతులెత్తేసింది. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్ ప్రభుత్వం పేదలకు మేలు చేసే ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలకు నిధులు, సిబ్బందిని కేటాయించి జవసత్వాలు ఊదింది. అయితే ప్రస్తుత కూటమి సర్కారు అధికారం చేపట్టి మూడు నెలలు గడవక ముందే ఈ సేవలను నిలిపివేసింది. దీంతో నేత్ర పరీక్షలు చేయించుకోలేక, కళ్లజోళ్లు పొందే అవకాశం లేక పేద, మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు.

జిల్లావ్యాప్తంగా ఆరు సీహెచ్‌సీలలో...

ప్రతీ ఒక్కరికీ నేత్ర పరీక్షలు చేసి, ఉచితంగా కళ్లజోళ్లు అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో 30 పడకల ఆసుపత్రి(సీహెచ్‌సీ)లలో ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా సత్తెనపల్లి, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, అమరావతి, గురజాల సీహెచ్‌సీలలో ఈ కేంద్రాలు నడుస్తున్నాయి. కంటి పరీక్షలు చేసేందుకు ఫండస్ మిషన్, ఏఆర్ మిషన్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతీ సీహెచ్‌సీలో ఒక ఆప్తాలిక్ అసిస్టెంట్, ఒక టెక్నీషియన్‌ను నియమించారు. వీరు యంత్రాల సాయంతో కంటి పరీక్ష నిర్వహించి, కంటి అద్దాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రెండు వారాల్లో రోగులకు కళ్లద్దాలు కూడా అందజేస్తారు.



బెల్లంకొండ ఈ-ఐ సెంటర్‌లో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

గతంలో 'కంటి వెలుగు'లు..

నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడే వారికి ఉచిత వైద్యం అందించాలని, పేద రోగులపై శ్రద్ధతో గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని ఏర్పాటు చేయడంతో పాటు సీఎం కేంద్రాలను కూడా కొనసాగించారు. ఈ పథకాన్ని 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి, కొద్ది రోజులకే నిలిపివేసింది. టీడీపీ ప్రభుత్వంలో పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ ఈ పథకం ద్వారా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వేల సంఖ్యలో కంటి పరీక్షలు చేసి, ఉచితంగా అద్దాలు అందించింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వీరు పాల్గొని విశిష్ట సేవలు అందించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి రెండు వారాల్లో కళ్లజోళ్లను నేరుగా ఇంటి వద్దే అందించారు.

నిలిచిపోయిన వైద్య సేవలు

గ్రామీణ ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా పేదలకు కంటి వైద్య సేవల ద్వారా మేలు చేసే ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల్లో సేవలు కొద్దిరోజులుగా నిలిచిపోయాయి. జిల్లాలోని ప్రతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రోజుకు దాదాపుగా 30 మంది వరకు ఓపీ నమోదు చేసుకుని సేవలు పొందుతుంటారు. కానీ సీఎం ఈ–ఐ కేంద్రాలలో ప్రస్తుత ప్రభుత్వం సేవలను నిలిపేసింది. దీంతో నేత్ర రుగ్మతలతో బాధపడే వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే స్తోమత లేక సతమతమవుతున్నారు.

ఉద్యోగులకు ఉద్వాసన!

ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల్లో నేత్ర పరీక్షలు చేసి, ఇతర సేవలు అందించేందుకు రాష్ట్రంలో 250 మందికి పైగా ఉద్యోగులను 2017లోనే ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నియమించారు. వీరంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనూ కొనసాగారు. పల్నాడు జిల్లాలో సుమారుగా 15 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా కుదిరిన ఒప్పందం ఈ వారంలో ముగిసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్‌ను రెన్యువల్ చేయకుండా సీఎం ఈ–ఐ కేంద్రాలను నిలిపివేసేందుకు సిద్ధమైంది. గడచిన ఏడేళ్లగా నేత్ర వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగుల కొనసాగింపు పైనా ప్రభుత్వం మౌనం వహించడంతో వారిలో ఆందోళన మొదలైంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



ప్రస్తుతం సీఎం ఈ–ఐ కేంద్రాల్లో పరీక్షలు, ఆన్‌లైన్‌లో అద్దాల నమోదు చేసే ప్రక్రియ నిలిచిపోయింది. ఈ సమస్యను ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో కంటి వైద్య పరీక్షలు చేసుకున్న వారికి అద్దాలు రాగానే పంపిణీ చేస్తాం. ఈ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వం రెన్యూవల్ చేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే తిరిగి సేవలను కొనసాగిస్తాం.

– డాక్టర్ మంత్రూ నాయక్, డీసీహెచ్ఎస్, పల్నాడు జిల్లా

వైద్య కళాశాల పనులు పూర్తి చేయాలి



మెడికల్ కళాశాలలపై వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదు. బాపట్ల మెడికల్ కళాశాలకు గతంలో రూ.550 కోట్ల నిధులు మంజూరు చేయగా.. రూ.150 కోట్లతో నిర్మాణ పనులు వేగంగా సాగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పనులను నిలుపుదల చేసి చోద్యం చూస్తున్నారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ఎంతో మందికి వైద్య సేవలతోపాటు మెడికల్ విద్యార్థులను తీర్చిదిద్దే కళాశాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు మానుకోవాలి.

– జోగి రాజా, దళిత సంఘం నాయకుడు, బాపట్ల



ప్రైవేటుపరం చేయడం తగదు



పేదలకు వైద్య విద్యను చేరువ చేసే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాలలను భారీగా మంజూరు చేయించారు. పనులు కూడా ప్రారంభించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్యవిద్యను నీరుగార్చుతూ ప్రైవేటుపరం చేయాలని చూడటం బాధాకరం. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కళాశాలలపై చేసిన ప్రకటన హాస్యాస్పదం. జిల్లాకు ఒక వైద్య కళాశాలను ప్రభుత్వం పూర్తి చేసి, పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలి.

– దాది శంకర్, రేపల్లె

రోగాలను 'నులి'మేద్దాం

- నులిపురుగులతో పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం
- రేపు జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం
- జిల్లాలో 1-19 ఏళ్ల పిల్లలు 4.33 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలు
- పంపిణీకి వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు పూర్తి

సత్తెనపల్లి: నులి పురుగు .. ఈ మాట వినడానికి చిన్నగానే ఉన్నా మనిషికి కలిగించే అనారోగ్యం పెద్దదే. చిన్నారుల్లో రక్తహీనతకు, రోగాలకు కారణమవుతున్న నులిపురుగుల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నాయి. ఈ ఏడాది కూడా ఈ నెల 17న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. 2024–25 విద్యా సంవత్సరంలో మొదటి విడత ఆల్బెండజోల్ మాత్రలను 1–19 ఏళ్ల విద్యార్థులకు అందజేసింది. పల్నాడు జిల్లాలో 4.33 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అదనంగా 10 శాతం మాత్రలను బఫర్ స్టాక్ గా పంపించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం...

నులిపురుగులు చిన్నారుల ఆరోగ్యంపై అధిక ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ముఖ్యంగా రక్తహీనత, పోషకాల లోపం బారిన పడతారు. చిన్నారుల కడుపులో కొంకి, నులి, బద్దె, గుండ్రని పురుగులు పెరిగితే అవి రక్తాన్ని పీల్చేస్తాయి. ఆ పురుగుల పునరుత్పత్తి, ఎదుగుదల మొత్తం జీర్ణవ్యవస్థలో జరగడంతో మనం తీసుకునే ఆహారాన్ని ఆ పురుగులు శోషించుకుంటాయి. ఫలితంగా పదేళ్ల వయస్సున్న వాళ్లల్లో ఎక్కువగా రక్తం లేకుండా బాధపడటం, పౌష్టికాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపు నొప్పి, వికారం, వాంతులు, అతిసారం, మలంలో రక్తం పడటం తదితర వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి.



విద్యార్థిని చేత ఆల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

ఈ విధంగా అరికట్టవచ్చు...

బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా వ్యక్తిగత మరుగుదొడ్డిని వాడాలి. మలవిసర్జన తర్వాత, భోజనానికి ముందు చేతులను సబ్బుతో బాగా శుభ్రం చేసుకోవాలి. చేతి వేళ్ల గోర్లు పెరగకుండా ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. చెప్పులు ధరించాలి. పరిశుభ్రమైన ఆహారాన్ని, నీటిని తీసుకోవాలి. నులిపురుగుల నివారణకు ఆల్బెంజోల్ దివ్య ఔషధం. ఏడాది లోపు వారికి, తీవ్రమైన అనారోగ్యం కలిగి ఉన్నవారికి ఈ మాత్రలు ఇవ్వరాదు. ఒకటి నుంచి 19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తీసుకోవాలి. వీటిని తీసుకోవడం వల్ల నులిపురుగుల నిర్మూలన జరిగి, రక్తహీనత దూరం అవుతోంది. ఒకటి నుంచి రెండేళ్ల లోపు పిల్లలు సగం ఆల్బెండజోల్ మాత్రను (200 ఎంజీ), రెండేళ్లకు పైబడిన వారు ఒక మాత్ర (400 ఎంజీ) తీసుకోవాలి.

జిల్లాలో ఇలా...

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ ప్రథమ సంవత్సరం, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తారు. జిల్లాలో 2010 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకటి నుంచి ఐదు సంవత్సరాలలోపు విద్యార్థులు 19,963 మంది, 1,531 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో 1,39,769 మంది, 516 ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1,77,573 మంది, 209 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్, పారామిలిటరీ, ఒకేషనల్ కళాశాలల్లో 24,413 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తారు.

విజయవంతం చేయాలి

జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న వైద్య సిబ్బంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తారు. పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పిల్లలు తప్పకుండా వేసుకునేలా చూడాలి. లేదంటే ఆరోగ్య సమస్యలు తలెత్తి పిల్లలు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఈ కార్యక్రమం విజయవంతంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

– డాక్టర్ రవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, పల్నాడు

గణ వీడ్కోలు



సత్తెనపల్లిలో నిమజ్జనానికి సిద్ధం చేసిన 61 అడుగుల వినాయక మట్టి విగ్రహం

భక్తిశ్రద్ధలతో 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం నిమజ్జనం

పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని శ్రీశ్రీ నగర్ లో శ్రీ సత్య సాయి యువజన సంఘం ఆధ్వర్యంలో సినీ ఆర్ట్ డైరెక్టర్ వీరాంజనేయులు పర్య వేక్షణలో పర్యావరణానికి పెద్దపీట వేస్తూ 61 అడుగుల మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఈ మట్టి గణపతికి అలంకరించే వస్తువులను సైతం ప్రత్యేకంగా రూపొందించారు. ఎటువంటి రసాయనాలు వాడకుండా కేవలం మట్టి, గడ్డి, కలపను మాత్రమే వినియోగించి విగ్రహాన్ని ప్రతిష్టించారు. తొమ్మిది రోజులపాటు నిత్యం ఉదయం, సాయంత్రం పూజలు అందుకున్న వినాయకుడిని ఆదివారం తొమ్మిదో రోజు భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేశారు. పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – సత్తెనపల్లి

బీసీ వర్గీయులపై టీడీపీ దాడులు అమానుషం

- దాడులకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించండి
- ప్రభుత్వ వైద్యశాలలో బాధితుడు సుబ్బారావును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: మండలంలోని యలమంద గ్రామంలో బీసీ వర్గీయులపై టీడీపీ నాయకులు చేస్తున్న దాడులను నిలిపివేయించి దాడులకు పాల్పడుతున్న వారిని వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ప్రభుత్వ వైద్యశాలలో టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న నూతలపాటి సుబ్బారావును పరామర్శించారు. జరిగిన విషయాన్ని బాధితుడు, ఆయన సోదరి నాగేంద్రంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ యలమంద గ్రామంలో గత కొన్నిరోజులుగా బీసీ కులస్తులపై జరుగుతున్న దాడులు అమానుషమని అన్నారు. ఇప్పటికే యాదవులు, వడ్డెర్లపై దాడిచేసి గ్రామం నుంచి తరిమివేశారన్నారు. ఇప్పుడు రజక కులస్తుల వంతు వచ్చిందన్నారు. కేవలం గత ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ఓటేశాడనే ఒకే ఒక్క కారణంతో సుబ్బారావును దినేష్, మౌలాలి అనే ఇద్దరు వ్యక్తులు అపహరించి రాడ్లు, కర్రలతో దారుణంగా కొట్టారన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం వారి వేధింపులు భరించలేక సుమారు 30 కుటుంబాలు ఊరు వదిలిపెట్టి వివిధ ప్రదేశాల్లో బతుకుతున్నారని, వాళ్ళని పట్టుకొచ్చి మరీ కొట్టడం దారుణమైన విషయమన్నారు. బాధితుడి సోదరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసి పోలీసులను తీసుకొని వెళితే పోలీసుల సమక్షంలోనే తిరిగి సుబ్బారావుపై టీడీపీ వర్గీయులు దారుణంగా కొట్టారని అన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. బాధిత వ్యక్తి తమ్ముడు శ్రీకాంత్ అనే వ్యక్తి ఇంటిపై కూడా దాడి చేశారని, ఇతను చేసిన పాపం వలంటీర్‌గా పనిచేయటమేనన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు చూడాలని, యలమంద గ్రామంలో ఊరు వదిలిపెట్టి వెళ్లిపోయిన వారిని ఊరిలోకి తీసుకొచ్చేందుకు ఎస్పీ చొరవ చూపించాలని కోరారు.



బాధితుడి ఒంటిపైనున్న గాయాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

విద్యార్థికి ఉపకారం

- ఎన్ఎంఎంఎస్‌తో పేద విద్యార్థులకు బాసట
- రేపటి వరకు దరఖాస్తుకు అవకాశం

సత్తెనపల్లి: పేదరికం చదువుకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు భరోసా కల్పిస్తోంది. ఎనిమిదో తరగతిలో డ్రాపౌట్స్ నివారించేందుకు ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్)తో ప్రోత్సహిస్తుంది. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ. 12 వేల చొప్పున మొత్తం రూ. 48 వేలను ఉపకార వేతనాల రూపంలో ప్రభుత్వం అందజేస్తుంది. ఇందులో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల ఆహ్వా నిస్తుంది. జిల్లాలోని మోడల్, ఎయిడెడ్, మున్సిపల్, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో చదువుతున్న 31,532 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు ఉపకార వేతన పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం ద్వారా దీన్ని పొందేందుకు అర్హులు. ఈ మేరకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.



2024–25 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ స్కాలర్ షిప్‌కు అర్హత సాధిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల కుటుంబ వార్షికాదాయం రూ. 3.50 లక్షల లోపు ఉండాలి. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతూ ఏడో తరగతిలో జనరల్, బీసీ కులాలకు చెందిన వారైతే 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ కులానికి చెందినవారు 50 శాతం మార్కులు సాధించాలి. జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 50 పరీక్ష ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. www.brc.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 8న రాత పరీక్ష నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో డీఎస్పీ విచారణ



పెదకూరపాడు: మండలంలోని లగడపాడు గ్రామంలో వినాయక శోభాయాత్ర సందర్భంగా ఎస్సీ వర్గీయులపై అగ్రకుల వర్గీయులు జరిపిన దాడికి సంబంధించి నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్‌బాబు ఆదివారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ నెల 9వ తేదీన వినాయకుని శోభాయాత్ర సందర్భంగా ఎస్సీ కులానికి చెందిన ఎర్రగొర్ల నరసింహరావు, పల్లం ఏసుపాదంపై అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు దాడి చేశారు. ఈ సందర్భంగా బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాధితులు, సాక్షులను విచారించారు. వారి వెంట ఎస్‌ఐ బాలూనాయక్ తదితరులు ఉన్నారు.

నేడు బ్రాహ్మణ మహా సంఘం జిల్లా సమావేశం

అమరావతి: అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘ సమావేశం సోమవారం స్థానిక యోగాశ్రమంలో నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక అమరేశ్వర స్వామి దేవస్థానంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం తదనంతరం యోగాశ్రమంలో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన అమరావతి క్షేత్ర పురోహితుడు కౌశిక ప్రసాదశర్మతో పాటుగా కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమానికి బ్రాహ్మణసోదరులందరూ హాజరవ్వాలని కోరారు.

కరాటే పోటీల్లో మంగళగిరి విద్యార్థులకు పతకాలు



మంగళగిరి: ఇటీవల ఏలూరులో జరిగిన నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో మంగళగిరి ఎంఎంకే స్టేడియం విద్యార్థులు ప్రతిభ కనపరచి పతకాలు సాధించారు. అండర్- 19 బాలుర విభాగంలో జె.మోహన్ సాయి బంగారు పతకం, అండర్ – 14 విభాగంలో కె. మహర్షిసాయి బంగారు పతకం, కె. నీరజ్ కుమార్ బ్రాంజ్ మెడల్ సాధించారు. అండర్- 12 విభాగంలో డి. మోనిష్కతన్ సిల్వర్ మెడల్, కటాస్ విభాగం అండర్- 17 బాలుర విభాగంలో వి. శ్రీరామ్ బంగారు పతకం, బాలికల అండర్- 12 విభాగంలో ఎస్. హేమావతి బంగారు పతకం, సుమ బ్రాంజ్ మెడల్ సాధించారు. విద్యార్థులను స్టేడియం ప్రతినిధులు, కోచ్ డి. ప్రభాకర్ అభినందించారు.

ప్రభుత్వంపై వైద్యుల పోరుబాట

- జీఓ నెంబర్ 85కు వ్యతిరేకంగా వైద్యుల ఆందోళనలు
- జిల్లాలో గ్రామీణ వైద్యసేవల నిలుపుదల
- అత్యవసర సేవలకు మాత్రమే హాజరవుతున్న పీహెచ్‌సీ వైద్యులు
- సోమవారం చలో విజయవాడకు పిలుపు
- ప్రభుత్వం స్పందించకపోతే నిరాహార దీక్షలకు సిద్ధం



వైద్య సేవలు బహిష్కరించి, నిరసన తెలియజేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

బెల్లంకొండ: గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పేద ప్రజలకు అత్యుత్తమ స్థాయిలో వైద్య సేవలు అందించాలని ఉన్నత లక్ష్యంతో గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగం బలోపేతానికి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం పీజీ విద్యలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్‌ను ఎత్తివేస్తూ జీఓ జారీ చేసింది. గత ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి, వైద్య రంగాన్ని బలోపేతం చేయగా... కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వహణ ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకోగా, తాజాగా ప్రభుత్వ వైద్యుల ఇన్‌సర్వీస్ కోటాలో సీట్ల కోత విధిస్తూ తీసుకున్న నిర్ణయంపై పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 85పై వైద్యులు మండిపడుతున్నారు. తమకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓను వెనక్కి తీసుకోవాలని ఈనెల 10 నుంచి నిరసన కార్యక్రమాలు మొదలుపెట్టారు. ప్రభుత్వం తీరు మారకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

జీఓ రద్దుకు వైద్యుల డిమాండ్...

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఎంబీబీఎస్ వైద్యులకు గత ప్రభుత్వం పలు రాయితీలను కల్పించింది. నిపుణులైన స్పెషలిస్ట్ వైద్యులను గ్రామాలకు పంపుతూ మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో పనిచేసింది. పీహెచ్‌సీలలో మూడేళ్లపాటు వైద్య సేవలు అందిస్తే... నీట్ పీజీ కౌన్సెలింగ్‌లో 30శాతం రిజర్వేషన్లు కల్పించింది. కాగా కూటమి ప్రభుత్వం ఈ రిజర్వేషన్లకు కోత విధిస్తూ కొత్తగా జీఓ నెంబర్ 85 తీసుకొచ్చింది. ఈ జీఓలో పీజీ కౌన్సెలింగ్‌లో ఆరు బ్రాంచ్‌లకు మాత్రమే ఈ రాయితీ వర్తించేలా నిబంధనలను విధించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, ఎనస్థీషియా, ఓబీ గైనకాలజీ వంటి వాటిలో మాత్రమే 15శాతం రాయితీ కల్పించారు. మొత్తంగా క్లినికల్స్, నాన్ క్లినికల్స్‌లో 19 బ్రాంచ్‌లు ఉండగా, కేవలం 6 బ్రాంచ్ లకు మాత్రమే రిజర్వేషన్ వర్తించేలా జీఓ ఇవ్వటంపై పీహెచ్‌సీ వైద్యుల్లో ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతుంది.

పోరుబాట పట్టిన వైద్యులు...

పల్నాడు జిల్లావ్యాప్తంగా ఉన్న 77 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీలు, మూడు ఏరియా వైద్యశాలలో దాదాపుగా 260 మందికి పైగా వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో అధిక శాతం గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించేవారే కావడంతో ఈ జీఓ వల్ల తమ వృత్తి ప్రగతికి నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. జీఓను రద్దు చేయాలని రెండు నెలలుగా అధికారులు శాసనసభ్యులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆందోళనకు దిగారు. గత శనివారం నుంచి విధులకు హాజరైనప్పటికీ అత్యవసర సేవలు మినహా ఇతర వైద్య సేవలను వైద్యులు నిలిపివేశారు.

ఇప్పటికే దశలవారీగా పోరాటం...

జీఓ 85 పై ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ ఉద్యమానికి పిలుపునిచ్చింది. ఈనెల 11 నుంచి దశలవారీగా పోరాటం చేస్తున్నారు. ఈనెల 16వ తేదీ వరకు నిరసన ప్రణాళిక విడుదల చేసి, ఆందోళన కార్యక్రమాల బాట పట్టారు. ఈ నెల 10న పీహెచ్‌సీలకు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. 11,12 తేదీలలో సేవలలో అంతరాయం లేకుండా నిరసన కొనసాగించి, ప్రభుత్వ చర్చల కోసం ఎదురుచూశారు. 13న అత్యవసర సేవలను మినహాయించి, అన్ని రిపోర్టింగ్‌లు, వీసీ, టీసీ, అధికారిక కమ్యూనికేషన్‌ల నిలిపివేశారు. 14,15న పీహెచ్‌సీలో కేవలం అత్యవసర సేవలు మాత్రమే విధుల నిర్వహించి, సాధారణ ఓపీ సేవలు నిలిపివేశారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో 16న ఛలో విజయవాడ ర్యాలీ, డైరక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద నిరసనకు పిలుపునిచ్చారు. అవసరమైతే జీఓ రద్దు చేసే వరకూ నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని వైద్యులు తెలియజేశారు.

సర్వీస్ కోటా రద్దయిపోతుంది



ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 85 వల్ల భవిష్యత్తు ఉన్నత చదువుల కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులు చేసిన సేవలు వృథాగా పోతాయి. ఉన్నతాధికారుల సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్నాం. వృత్తిపరంగా నైపుణ్యం సాధించే క్రమంలో పీజీలు చేసే అవకాశాలు జీఓ 85 అమలు ద్వారా తగ్గిపోతాయి. గతంలోనే జీఓపై తమ అభిప్రాయాలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి వివిధ రూపాల్లో తీసుకువెళ్లాం. సర్వీస్ కోటా రద్దయిపోతే పీజీలో చేరేందుకు ఉన్న అవకాశాలు పూర్తిగా సన్నగిల్లిపోతాయి. కేవలం ఐదు విభాగాలు మినహా మిగిలిన పీజీ కోర్సుల్లో చేరే అవకాశం ఉండదు.

– డాక్టర్ కేవీ కోటేశ్వరరావు, వైద్యాధికారి, పీహెచ్‌సీ, చంద్రాజుపాలెం, బెల్లంకొండ మండలం

జీఓ ఉపసంహరించుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం యువ వైద్యుల ఉన్నత విద్య ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా విడుదల చేసిన జీఓను వెంటనే ఉపసంహరించుకోవాలి. ఏకపక్షంగా తీసుకున్న ఇలాంటి నిర్ణయాలు పీహెచ్‌సీ వైద్యులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. ఇది ముమ్మాటికీ చీకటి జీఓనే. కొత్త జీఓ ప్రకారం ఇస్తున్న కోటాలోనూ క్లినికల్ సీట్లను కేవలం ఆరు విభాగాలకు మాత్రమే పరిమితం చేయడం అన్యాయం.

– డాక్టర్ వి.ప్రదీప్, వైద్యాధికారి, పీహెచ్‌సీ ఫణిదం

పీజీ అవకాశాలు తగ్గిపోతాయి



శాఖాపరమైన అధికారుల సూచనల మేరకు ఉన్నత చదువులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ జీఓ అమలు కారణంగా సర్వీస్ కోల్పోవడంతో పాటు పీజీలో చేరే స్థానాల సంఖ్య తగ్గిపోతుంది. 30శాతం ఉన్న పీజీ కోటా 15 శాతానికి పడిపోతుంది. దీనికి తోడు ఆర్థో, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, గైనిక్, జనరల్ సర్జన్ మినహా మిగిలిన విభాగాలకు చెందిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుకునే అవకాశం కూడా లేకపోవడం అన్యాయం.

– డాక్టర్ ఎస్.బాల అంకమ్మ బాయి, పీపీ యూనిట్, సత్తెనపల్లి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో విగ్రహాల ఏర్పాటు సరికాదు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ముందస్తు అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటుచేయటం ఏమాత్రం సబబుకాదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో లింగంగుంట్ల కాలనీలోని 200 పడకల ప్రభుత్వ హాస్పిటల్‌లో కోడెల వర్గీయులు దివంగత మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు విగ్రహం ఏర్పాటు చేయడంపై గోపిరెడ్డి స్పందించారు. పల్నాడురోడ్డులోని పెద్దచెరువు బైపాస్‌రోడ్డు సెంటర్‌లో ఎవరికీ ఎటువంటి ఇబ్బందిలేని ప్రదేశంలో దివంగత వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తుంటే టీడీపీ నాయకులు హైకోర్టును ఆశ్రయించి నిలిపివేయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఒక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో విగ్రహాలు ఏర్పాటుచేయటమనేది నరసరావుపేట చరిత్రలో ఇప్పటివరకు జరగలేన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా ఏవిధంగా ఏర్పాటుచేస్తారని ప్రశ్నించారు. తాను కోడెల విగ్రహ ఏర్పాటుకు, ఇతర నాయకుల విగ్రహాలు ఏర్పాటుకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ హాస్పిటల్ నిర్మాణానికి కాసు వెంకటకృష్ణారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో కేంద్ర నాబార్డు సంస్థచే రూ.20కోట్లు మంజూరు చేయించారన్నారు. అయితే ఆ సమయంలో ఎన్నికల కోడ్ రావటంతో నిర్మాణం ప్రారంభించలేదన్నారు. ఆతర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో హాస్పిటల్ భవనం నిర్మించి ఎటువంటి మౌలిక వసతులు ఏర్పాటుచేయకుండానే వదిలేసి వెళ్లారన్నారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.7.5కోట్ల వ్యయంతో హాస్పిటల్ నిర్వాహణకు అయ్యే వసతులు అన్నీ కల్పించటంతో రోగులకు వైద్యసేవలు అందజేస్తున్నారన్నారు. కరోనా సమయంలో ఈ వైద్యశాల ద్వారా వేలాదిమందికి సేవలు అందాయన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో విగ్రహాలు ఏర్పాటుచేయకుండా చూడాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విజ్ఞప్తి చేశారు. కాగా, విగ్రహం ఏర్పాటుచేసిన ప్రదేశంలో ఎటువంటి ఇతర పనులు జరగకుండా పోలీసులను కాపలా ఉంచారు.

భరత జాతి ముద్దుబిడ్డ విశ్వేశ్వరయ్య



విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద అధికారులతో కలిసి నివాళులర్పిస్తున్న ఎస్ఈ కె.వెంకటరమణ

సత్రశాల(రెంటచింతల): ఇంజినీరింగ్ రంగంలో అసాధారణ ప్రతిభతో అత్యున్నత శిఖరాలను అధిరోహించి మన దేశ ఖ్యాతిని నలుదిక్కులకు చాటిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారత జాతి గర్వించదగ్గ ముద్దు బిడ్డ అని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ ఎస్ఈ కె.వెంకటరమణ అన్నారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ప్రాజెక్ట్ ఆవరణలోని విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. 1861 సెప్టెంబర్ 15న జన్మించిన విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా ఇంజినీర్స్‌డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. జలాశయాల నిర్మాతగా, ఆర్థికవేత్తగా ప్రపంచ వ్యాప్తంగా శాశ్వత కీర్తిని గడించిన డా.విశ్వేశ్వరయ్యను భారత ప్రభుత్వం 1955 సం.లో భారత రత్నా పురస్కారం తోను, బ్రిటీష్‌ప్రభుత్వం అత్యుత్తమ పౌరపురస్కారమైన బ్రిటిష్ నైట్‌హుడ్‌గా సన్మానించిందన్నారు. ఏఈఈలు ఎస్.జయపాల్, బి.కాసులు, స్పెషల్ ఫోర్స్ సిబ్బంది, కాంట్రాక్ట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్తిపాడులో ఒంగోలు జాతి పశు ప్రదర్శన

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో నందమూరి తారక రామారావు మెమోరియల్, నూతలపాటి పరమేశ్వరరావు మెమోరియల్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఒంగోలు జాతి పశు ప్రదర్శన జరగనుంది. పాల పళ్లు, రెండు పళ్లు, నాలుగు పళ్లు, ఆరు పళ్ల విభాగాలతో పాటు సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్, కేటగిరీ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. తొలి రోజు టచ్ పళ్ల విభాగంతో ప్రదర్శన ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఒక విభాగంలో పాల్గొన్న జతలు మరొక విభాగంలో పాల్గొనేందుకు అవకాశం లేదని, జెర్సీ జాతికి ప్రవేశం లేదని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి జతలు రానున్నాయని వివరించారు. విజేతలకు నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

సుబ్బారావుపై దాడికేసులో నిందితులను అరెస్ట్ చేయండి



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: యలమంద గ్రామానికి చెందిన రజక కులస్తుడు నూతలపాటి సుబ్బారావుపై దాడి చేసిన తెలుగుదేశం వర్గీయులను వెంటనే అరెస్టుచేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ సుబ్బారావుపై టీడీపీకి చెందిన వర్గీయుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గ్రామానికి చెందిన దినేష్, మరికొందరు బలవంతంగా కిడ్నాప్ చేసి గ్రామ సమీప పొలాల్లోకి తీసుకెళ్లి ఐదుగంటల పాటు కాళ్ల మీద ఇద్దరు, చేతులు విరిచి మరికొందరు కర్రలతో దాడి చేశారన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక టీడీపీ వారి దాడి నుంచి తప్పుకోవటానికి బాధితుడు పట్టణంలోనే నివాసం ఉంటున్నాడన్నారు. ఇలాగే సుమారు 30 కుటుంబాలు దాడుల నుంచి రక్షణ కోసం వివిధ ప్రాంతాల్లో జీవిస్తున్నారని చెప్పారు. దెబ్బలు తీవ్రంగా ఉండటంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించి అక్కడ పరీక్షలు చేసి మళ్లీ స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు పంపారన్నారు. తమపై పెట్టిన కేసు ఉపసంహరించుకోకపోతే, కౌంటర్ కేసు పెట్టి, అంతు చూస్తామని, వచ్చే ఐదేళ్లపాటు తాము అధికారంలో ఉంటామంటూ బాధితుడిని అహంభావంతో బెదిరిస్తున్నారన్నారు. వెంటనే వారిని అరెస్టు చేసి బాధితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పీడీఎం నాయకుడు షేక్ దర్యావలి, రాంబాబు, ప్రజా కళామండలి రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరరావు, సీఎల్పీ జిల్లా నాయకుడు శిఖినం చిన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అట్యా-పాట్యా పోటీల విజేతలు పల్నాడు జట్లు



ప్రథమస్థానంలో నిలిచిన బాలుర జట్టు

నరసరావుపేట రూరల్: కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో ఈనెల 14,15తేదీలలో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి అట్యా-పాట్యా పోటీలలో జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. అండర్-17 జూనియర్ బాల, బాలికల చాంపియన్ షిప్ పోటీలలో పల్నాడు జిల్లా జట్లు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీ, సర్టిఫికెట్లు అందజేశారు. బాల, బాలికల జట్ల కోచ్‌లుగా చింతా పుల్లయ్య, జి.ఝాన్సీరాణి, మేనేజర్‌గా బి.తిరుమలబాయ్ వ్యవహరించారు. ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా జట్లను ఏపీ స్టేట్ అట్యా-పాట్యా సీఈఓ రంభా దుర్గా ప్రసాద్, కార్యదర్శి రంభా శ్రీచరణ్, జిల్లా కార్యదర్శి ఉన్నం రోహిత్‌లు అభినందించారు.



విజేతగా నిలిచిన బాలికల జట్టు

యాదవ మహా సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

గుంటూరు రూరల్: అఖిలభారత యాదవ మహా సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా మిర్చి యార్డు మాజీ డైరెక్టర్ తాళ్ల నాగరాజు యాదవ్ ఎన్నికయ్యారు. నగరంలోని గ్రాండ్ నాగార్జున హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అఖిల యాదవ మహా సంఘం జిల్లా, నగర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోరంట్ల గ్రామానికి చెందిన తాళ్ల నాగరాజు యాదవ్, నగర అధ్యక్షుడిగా కొండేపి శేఖర్ యాదవ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యుల్ని సంఘం జాతీయ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, కార్యదర్శి కె.ఎల్.పి. యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పటూరి పేరయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు పెద్దిబోయిన బాలయ్య తదితరులు పుష్పగుచ్చాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రానున్న కాలంలో సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. యాదవుల్ని ఒకే తాటిపైకి తెచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలువురు యాదవులు పాల్గొన్నారు.

అప్సా డెమోక్రటిక్ గుంటూరు జిల్లా శాఖ కార్యవర్గం



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ (అప్సా డెమోక్రటిక్) సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్లో ఆడిటోరియంలో నిర్వహించారు. ఇందులో గుంటూరు జిల్లా శాఖకు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షునిగా సాదినేని శ్రీనివాసరావు (భారవి స్కూల్), అధ్యక్షుడిగా చిన్నం శ్రీనివాసరావు (ఎస్ఆర్ఎస్ రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్), కార్యదర్శిగా డాక్టర్ కోనూరు జయకుమార్(ఇంటెల్ హైస్కూల్), ఉపాధ్యక్షుడిగా పఠాన్ ముసారత్ (రత్నం స్కూల్), సంయుక్త కార్యదర్శిగా నక్కా జార్జిబాబు (ఒలీవ్ స్కూల్), కార్యనిర్వాహక సభ్యులుగా రంగాచారి (సిమ్స్ మై స్కూల్), శివ శంకర్ (విజేత స్కూల్)తో పాటు మరి కొంతమంది సభ్యుల్ని తెనాలి, తాడికొండ, మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు, గుంటూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్, నియోజకవర్గాల నుంచి ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అప్సా డెమోక్రటిక్ వ్యవస్థాపక చైర్మన్ గొల్లపూడి మోహన్‌రావు మాట్లాడుతూ తక్కువ వ్యవధిలో జిల్లాలో నియోజకవర్గాల వారీగా పెద్దసంఖ్యలో సభ్యులుగా చేరడం శుభ పరిణామమని తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు, మల్లికార్జునరెడ్డి (మైలవరం), మన్నవ అప్పాజీ (మంగళగిరి), చిరుమామిళ్ల రాము (నరసరావుపేట), ఆక్స్‌ఫర్డ్ కాలేజీ డీజీఎం విడదల శేషగిరిరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

ఫిరంగిపురం: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి ఫిరంగిపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములూరిపాడుకు చెందిన కె.నాగరాజు (25)శనివారం రాత్రి ఫిరంగిపురం గ్రామ శివారులోని ఓ హోటల్‌లో బిర్యాని తినేందుకు వచ్చాడు. అనంతరం రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి కడప వెళుతున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పల్నాటి వీరాచారవంతుడు గురవయ్య మృతి

రణక్షేత్రంలో అంత్యక్రియలు



వీరాచారవంతుడు గురవయ్య (ఫైల్)



పల్నాటి ఉత్సవాల్లో పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ వెంట నడుస్తున్న గురవయ్య(ఫైల్)

కారెంపూడి: పల్నాటి వీరాచారవంతుడు ఆవుల గురవయ్య (82) మృతి చెందాడు. ఆయన స్వగ్రామమైన నర్సరావుపేట రూరల్ మండలం ఇక్కుర్తిలో శనివారం మృతి చెందాడు. ఆయన తుది శ్వాస విడిచే ముందు పల్నాటి రణక్షేత్రమైన కారెంపూడిలోనే మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించాలని వీర్లగుడి నిధి పూజారులను, పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవను వీడియో కాల్‌లో గురవయ్య కోరారు. ఆయన కోరిక మేరకు పల్నాటి వీరుల గుడి ఆవరణలో ఉన్న వీర్ల మండపం సమీపంలో ఆయన మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. గురవయ్య బంధువులు, వీర్ల గుడి నిధి పూజారులు, పల్నాటి వీరాచార పీఠం నిర్వాహకుడు విజయ్ కుమార్ తదితరులు సంప్రదాయం ప్రకారం అంతిమ కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఇదిలా ఉంటే గురవయ్య వంశస్తులు వంశపారంపర్యంగా పల్నాటి వీరారాధన ఉత్సవాలలో లంకన్న ఒరుగు కార్యక్రమాన్ని అత్యంత నిష్టతో నిర్వహిస్తున్నారు. గురవయ్య వయస్సు మీద పడడంతో వీరాచారం ప్రకారం అతని మనవడు ఆవుల బాలచంద్ర ఆ కార్యక్రమాన్ని గత రెండేళ్లుగా నిర్వహిస్తున్నారు.

అనేక ఏళ్లుగా లంకన్న పాత్రలో...

పల్నాటి ఉత్సవాలలో చివరిరోజు కళ్లిపాడు నాడు లంకన్న ఒరుగు అత్యంత ఉద్విగ్న భరితవాతావరణంలో జరుగుతుంది. పల్నాటి చరిత్రలో ఆలమందల అధిపతి లంకన్న. ఆయన మందపోరులో వీరమరణం పొందితే అతనికి బ్రహ్మనాయుడు ప్రాణప్రతిష్ట చేశాడనే చరిత్రాంశాన్ని ఉత్సవాలలో నాటకీయంగా ప్రదర్శిస్తారు. లంకన్న పాత్రను గురవయ్య అనేక ఏళ్లుగా నిర్వహించారు. వీరులగుడి ఆవరణలోని కళ్లితోరణం వద్ద లంకన్న ఒరుగుగా పిలిచే ప్రదేశం ఉంది. అక్కడ లంకన్న పాత్రలో గురవయ్య ప్రాణంలేని వ్యక్తిలా రాత్రంతా పడుకుని ఉండడం లంకన్న మృతి వార్త విని బ్రహ్మనాయుడు పాత్ర నిర్వహించే పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ, ఇతర వీరాచారవంతులు లంకన్న ఒరుగు వద్దకు పరుగున చేరుకోవడం లంకన్నకు పీఠాధిపతి శంకుతీర్థం ఇచ్చి ప్రాణప్రతిష్ట చేయడం ఉత్సవాలలో జరుగుతుంది. ఎంతో కష్టతరమైన ఒక్కోసారి తెలియని వారికి నిజంగానే మనిషి చనిపోయాడా అనేంత విషాదవాతావరణం అక్కడ ఉంటుంది. ఎంతో పవిత్రమైన పల్నాటి వీరాచారాన్ని గురవయ్య వంశస్తులు తరతరాలుగా వంశపారంపర్యంగా నిర్వహిస్తున్నారు. గురవయ్యకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం

రోడ్డు పక్కన కారు టైరు మారుస్తుండగా ఘటన

నాదెండ్ల: కారు టైరు పంక్చరవటంతో జాతీయ రహదారి పక్కన కారును నిలిపి టైరు మార్చుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇరువురు దుర్మరణం పాలైన సంఘటన యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామ పరిధిలో తిరుమల స్పిన్నింగ్ మిల్లు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు ఏలూరు జిల్లా నిడమర్రు గ్రామానికి చెందిన వడల కృష్ణ (31), రవికిషోర్ (25) ఇరువురూ కారు డ్రైవర్లుగా పనిచేస్తుంటారు. కాకినాడలోని ఫిష్ హేచరీల నుంచి రొయ్యల శ్యాంపిల్స్‌ను తీసుకుని ఏపీ39 బీఎం 7126 నంబరు గల మారుతీ ఎర్టిగా కారులో నెల్లూరు వెళ్లారు. తిరిగి ఏలూరుకు వెళ్లే క్రమంలో తిమ్మాపురం వద్దకు వచ్చేసరికి ఆదివారం తెల్లవారుజామున కారు వెనుక టైరు పంక్చరైంది. దీంతో కారును రహదారి పక్కన నిలిపి టైరును మారుస్తున్నారు. అదేసమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో వడల కృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, రవికిషోర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. 108 సాయంతో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢీకొన్న వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు హైవేపై ఉన్న సీసీ కేమేరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.